# పెనమూ. పొయ్యా

నరహరికి మనసు మనసులో లేదు. ఒకటే తహతహ లాడి పోతున్నాడు. రెక్కలు కట్టుకున్నట్టుగా ఎగిరి వెళ్ళి మునిసిపల్ గెస్ట్‌హవుసులో వాలిపోవాలని వుందతనికి! కానీ అంతలో ఒక సందేహం. వెళ్ళిన సమయానికి వసుంధర ఒంటరిగా వుండకపోతే?

మనసులో ఎన్నో కోరికలుంటాయి. చుట్ట చుట్టుకుని పుట్టలో నిద్రపోయే పాముల్లాంటివి కొన్ని. వాటిని లేపనే కూడదు. లేచాయంటే, యిక వాటిని సముదాయించడం కష్టం.

ఇప్పుడు నరహరి కెదురైవున్న పరిస్థితి అదే!

ఆరోజు ఉదయం నరహరి, గాపం మామూలుగానే నిద్రలేచాడు. అతడు చేసిన నేరం నిద్ర లేవగానే ప్రక్క వీధిలో వున్న చందమామ హేర్ డ్రెస్సింగ్ సేలూనుకు వెళ్లడం మాత్రమే! ముఖానికి దట్టంగా నురగ పట్టించుకుని, ధ్రువపు ఎలుగుబంటిలా కుర్చీలో కూర్చున్న భాగోతం అప్పలరాజు నిలువుటద్దంలో నుంచే నరహరి రాకను పసిగట్టాడు. కత్తిని పట్టుకున్న మంగలి చేతిని వెనక్కి నెడుతూ "ఏమోయ్ నరహరీ! రావయ్యా, రా! నీకొక మంచి వర్తమానం!" అనాడు.

రంగనగరమనే ఆబస్తీలో నరహరి వున్న పదపదిహేను మంది వేడుక చెలికాళ్లలో అప్పలరాజు ఒకడు. ఆవేడుక చెలికాళ్ల దృష్టిలో నరహరి 'ప్రిన్స్ ఆఫ్ వేల్స్'తో సమానం. చాలాకాలం మునిసిపల్ కౌన్సిలర్‌గా వుండి, వెంట్రుకవాసిలో చేర్మన్ గాకుండా పోయిన మోహన రంగం గారి ఏకైక పుత్రుడు నరహరి. కార్యకర్తలు చేసే గదా నాయకుడు! అందుకని నరహరి తన చిన్నతనంనుంచే మొదలుపెట్టి, అప్పలరాజు లాంటి వాళ్లని మచ్చిక చేసి పెట్టుకున్నాడు. వాళ్ల అనేక విషయాల్లో అనేక విధాలుగా నరహరికి తోడ్పాటు చేస్తూవుంటారు. ఆసక్తికరమైన వార్తల్ని చేరవేయడం. రాయబారాలు నడపడం, అవసరమైతే నరహరి తరఫున భుజ బలాన్ని ప్రదర్శించడం - యిలాంటి విద్యలు వాళ్లకు కొట్టిన పిండి. అందుకు ప్రతిఫలంగా అయిదూ పదీ దగ్గరినుంచీ, మందు పార్టీదాకా రకరకాల సన్మానాలను ఆశిస్తూ వుంటారు.

"ఏమిట్రా బాబూ! చెప్పరా చంపక!" అన్నాడు నరహరి.

అప్పలరాజుకు పెద్దచిక్కే వచ్చి పడింది. విషయాన్ని మంగలి నారాయణకు తెలియనివ్వడమంటే డప్పుకొడుతూ ఊళ్లో చాటింపు వేయడమన్నమాట! అందువల్ల వర్తమానం అతడికి బోధపడగూడదు. నరహరికి మాత్రం అర్థం కావాల.

"చెబుతానుండు, చె బు తా ను ం డు" అన్నాడు అప్పలరాజు. అతడికి తెలుసు 'ఆత్రగాడికి బుద్ధి మట్టు' అని. 'అత్రగాడికి ఆకులో పెడుదువుగానీ, నాకు మాత్రం నేల పైన్నే పెట్టు' అనే వాటం నరహరిది. అతడు ఆలస్యాన్ని భరించలేడు.

అయితే అప్పలరాజు బుర్ర సామాన్యమైనదేమీగాదు. గూఢంగా మాట్లాడడానికి టకీమని అతనొక ఉపాయం కనిపెట్టేశాడు.

"వనము సుందరమైనది ధరణీతలంలో- తెలిసిందా? నాలుగక్షరాలు మాత్రం ఏరుకో!"

'వనము సుందరమైనది ధరణీతలంలో' - రెండు మూడు సార్లు పునశ్చరణ చేసుకోగానే నరహరి బుర్రలో మెరుపు మెరిసింది. "ఓహో, అట్లా గా!. తెలిసిందలే! వాక్యానికి కర్తేమిటో తెలిసింది. క్రియ సంగతి చెప్పు" అన్నాడు.

"ఏముంది? అరుదెంచింది".

వచ్చింది అంటే నారాయణ తెలుసుకుంటాడు.

"ఎప్పుడు? ఎక్కడ? ఎట్లా?" పైకొన్న ఉద్వేగంలో నోటి కొచ్చిన ప్రశ్నలన్నీ గుప్పించాడు నరహరి.

అప్పలరాజు కంప్యూటర్ బుర్ర మరింత చురుగ్గా పనిచేసింది "పూర్వార్థగోళంలోని వాళ్లు పశ్చిమార్థ గోళాన్ని పాతాళమనుకుంటారు గదా! ఇప్పుడీ కర్త ఆగమనం ఆ పాతాళం నుంచే! ప్రస్తుత మకాం స్థానిక పురపాలక సంఘ విశ్రాంతి మందిరం!"

నరహరి తలపంకించాడు - వసుంధర అమెరికా నుంచీ వచ్చిందన్న మాట! అయితే ఎప్పుడొచ్చింది, ఎందుకొచ్చింది, ఎన్నాళ్ళుంటుంది, యివన్నీ అవశ్యంగా తెలుసుకోవలసిన వివరాలు.

అందులో ఎందుకొచ్చిందన్న అంశం మాత్రం నరహరికి చాలా ఆసక్తిదాయకంగా వుంది. తల్లిపోవడంతో వసుంధరకి పట్నంతో వుండిన లంకె తెగిపోయింది. అమెరికా ధాన్ను రావడంతో చేస్తూ వుంకిన ఉద్యోగం వదలిపెట్టేసింది స్నేహితురాండ్రు వుంటారు గదా అనొచ్చు. ఉండే వుంటారు. కానీ వాళ్ల కోసం సముద్రాలు దాటి, దేశాలు దాటి యింత దూరం వస్తుందా? అబ్బే, అంతకంటే బలీయమైన ఆకర్షణ ఏదో యిక్కడుండాలి. ఏమిటది?

ఈ ప్రశ్నకు స దు త్త ర మే మి టో నరహరికి తెలిసినట్టే వుంది.

ఇప్పుడైతే దూరమైపోయిందిగానీ, ఒకప్పుడు వసుంధర తన అరచేతిలోని మలాకాపండు. తన చుట్టూరా పల్టీలు కొడుతూ తిరిగిన ప్రేమపక్షి. కాదని బుకాయించడమంటే మాటలా! ఆమె రాసిన ఉత్తరాలు దాఖలాగా వున్నాయి సరేనయ్యా! అనుకున్నవన్నీ జరిగి పోతాయా జీవితంలో? కోరిక నెరవేరకపోవడం వల్ల వసుంధర బాగా క్రుంగిపోయింది స్వస్థలాన్నే గాక స్వదేశాన్నే వదిలి పెట్టింది. కానీ పాత జ్ఞాపకాలు పూరకుంటాయా? అవి వెన్నంటి తరిమి తరిమి చీకాకు పరిచి వుంటాయి. ఊపిరి సలుపుకోలేక యిప్పుడిలా పరతెంచి వచ్చేసింది...

'చూడు నరహరీ! అమెరికా వెళ్లింది నా బొందే గానీ, నా మనసుగాదు. మనసు యిక్కడే వుండిపోయింది. కన్ను మూసినా తెరిచినా నువ్వే కనిపించేవాడివి. ఏకాంతంలో నీ మాటలే వినిపించేవి. దారి తెలియని అగాధంలో పడిపోయినట్టుగా నిరాశ, నిస్పృహ, అసంతృప్తి నన్ను వేపుకు తిన్నాయి. బ్రతుకంతా ఎండమావిలా అయి

## మధురాంతకం రాజారాం

పోయిందనుకో! ఆత్మీయత కోసం, ఆప్యాయత కోసం ముఖం వాచి, యిలా వచ్చేశాను. నువ్వు కనిపించావు. అంతేచాలు!' అంటూ తన ఒడిలో వాలిపోయిన వసుంధరను ఓదారుస్తున్నట్టు పగటి కల కంటున్న నరహరి 'అయిపోయింది ఏమోయ్ నరహరీ! నేను వెళ్దునా మరి' అంటూ అప్పల్రాజు కుర్చీలో నుంచీ దిగేసరికి, ఉలిక్కిపడ్డట్టుగా వాస్తవిక జగత్తులోకి వచ్చేశాడు.

అప్పల్రాజు వెంట మెట్లు దిగి, రోడ్డు పైకి వెళ్లాక అడిగాడు - "ఏదురా అప్పల్రాజా! వచ్చిన వసుంధర స్నేహవుసులో ఎందుకు మిగిలింది? స్నేహితులెవరూ లేరా?"

"అంతే మాత్రం! మొగుడితో బాటుగా వచ్చింది స్నేహితుల యింట్లో దిగుతుందా? అంతగా ఎవరైనా పిలిస్తే ఏ లంచికో సప్పరకో వెళ్లి వచ్చేస్తుందనీ..."

"ఏమిటేమిటి? వసుంధర మొగుడా?" ఏనాడో మాట ఏదో విన్నట్టుగా వెక్కసపడిపోయాడు నరహరి. అతడి ముఖ లక్షణాలిప్పుడు ఆమడం లాగింత చీదరగా వున్నాయి.


"అదేమిటివే! ఆమెకి గూడా మగడున్నాడు, అలా అంటున్నావు. అమెరికా వెళ్లి ఉద్యోగం సంపాదించుకోగలిగింది, అక్కడొక మొగుణ్ణి సంపాదించుకోలేకపోతుందా? మన దేశీయుడేలే. అమెరికా వాడేం కాదు. అసిస్టెంట్ ప్రొఫెసరుగా వున్నాడట! ఒక రీసెర్చి ప్రాజెక్టు పైన భారతదేశమంతటా పర్యటించాల్సి వచ్చి, యిలా భార్యా సమేతంగా యిక్కడికి వచ్చేశాడట..."

"అవునూ, యింతటి విశేషాలు నువ్వెలా సేకరించావురా అప్పల్రాజు" విస్తుపోతూ అడిగాడు నరహరి.

"రిటైర్డ్ హెడ్మాస్టరు జగ్గారావు గారుండడం మా వీధిలోనే గదా! రిటైరయ్యాక ఆయన పెద్ద పబ్లిక్ రిలేషన్ ఆఫీసరై కూర్చున్నాడు. రోడ్డంట ఎవరైనా వెళుతుంటే అరగంటసేపు నిలిపి మాటాడ్డమే పని. ఆయన ఎవరితోనో చెబుతుంటే విన్నాను..."

దొరికి దొరికి వసుంధరకు ప్రొఫెసరే దొరికాడా? ప్రొఫెసర్లు వట్టి మతిమరుపు మనుషులని ఎవరికి తెలియదు? మునుపటి





కెవడో ప్రొఫెసరు వర్షంలో పోస్టాఫీసుకు వెళ్తూ ముడిచిన గొడుగును చంకలో పెట్టుకుని, కవరు తలకడ్డంగా పట్టుకున్నాడట! ఎంతసేపైనా పుస్తకాలు, పరిశోధనలేగాని వాళ్లకు ప్రాపంచిక విషయాలపైన ఆసక్తి వుండదట. అలాంటి వాణ్ణి కట్టుకున్న ఆడదానికి ఏంసుఖముంటుంది? 'ఏమండీ! సినిమా కెళ్దామండీ' అంటే 'టి.వి. చూస్తే పోలా' అంటాడేమో! 'షాపింగుకు వెళ్దామండీ' అంటే, 'నేను చదువుకోవాలి నువ్వు వెళ్లిరారాదు' అంటాడేమో! అతగాడితో వేగలేక వసుంధరకు మతిపోయి వుంటుంది. స్వదేశానికి రావడంలో ఆమె ఉద్దేశం పోయిన మతిని ప్రోది చేసుకోవడమే అయివుండాలి...

"బాబుగారూ! షేవింగు కానివ్వకుండానే వెళ్లిపోతున్నారా?" అంటూ మంగలి నారాయణ ఎలుగెత్తి పిలిచేదాకా నరహరి ఈ లోకంలో లేడు. కల్లలుకుతూ పేరు మరచిన ఈగలా తయారైనందుకు సిగ్గుపడిపోతూ అతను సెలూన్లోకి తిరిగి వెళ్లాడు. నున్నగా ముఖం గీకించుకుని, ఆఘమేఘాలపైన యింటికొచ్చి స్నానాడు. తొందర తొందరగా స్నానపానాలు ముగించాడు. వెంటనే తన గదిలోకి దూరి ఫోనుతో కలయబడ్డాడు.

గెస్ట్‌హవుసు అటెండరు రామ్మూర్తి గూడా నరహరి ఆశ్రిత కోటిలోనివాడే!

"మీరాసార్! నమస్కారం. ఏంకావాలి? రూమేదైనా..."

"అబ్బే, కామలేవోయ్! చిన్న ఇన్‌ఫర్మేషన్ కావాలి. అమెరికా నుంచీ, వసుంధరని ఒకావిడ..."

"ఉన్నారుసార్! ఆమె హస్బెండు గూడా వున్నారు. ఎడమ వైపు డబల్ రూంలో దిగారు. వాళ్ల సమపాయాలన్నీ నేనే చూస్తున్నా! రెండుపూటలా హూటల్ అప్సరాలోనుంచీ కారియర్ వస్తోంది..."

"చాల్లే గొడవ! ఇందాకా చెప్పావే ఆడమనిషి, ఒంటరిగా వున్నప్పుడు నేనావిడను కలుసుకోవాలి..."

"దానికేముంది సార్! మధ్యాహ్నం భోజనం కాగానే కాసేపు రెస్టు తీసుకుని ఆయనగాయన టాక్సీ చేయించుకుని వెళ్లిపోతాడు. రకరకాల రాళ్ళు, మట్టి దినుసులు, ఆకులలములు ఓబుట్ట నిండుకూ సేకరించుకుని సాయంకాల మెప్పుడో తిరిగొస్తాడు..."

"మంచిది. వీలు చూచుకుని నాకు ఫోన్ చేస్తావు గదూ?"

"తప్పకుండ! అలాగే సార్!"

ప్రాతిపదిక సిద్ధమైపోయిందన్న సంతృప్తితో, సోఫాలో చేరగిలబడ్డ నరహరి, సీటు క్రింద టపాకాయ ప్రేలినట్టుగా ఎగిరి పడ్డాడు. గుమ్మంలో కాంచనమాల నిలబడి వుంది. నిల్చున్న తీరునుబట్టి చూస్తే, ఆమె తనతో 'ఎన్ కౌంటరు'కు సిద్ధపడిన లక్షణాలు కొట్టొచ్చినట్టుగా కనిపిస్తున్నాయి.

"నిలబడిపోయావేం కాంచనా! రా, కూచో! ఏంకావాలి?" లోలోపల తల్లక్రిందులైపోతూనే అన్నాడు నరహరి.

"నాక్కావలసినవన్నీ నాకున్నాయిలెండి! ఇంకా మీకే ఏదో కావలసినట్టుంది. ఎవరికోసమో వాకబు చేస్తున్నట్టు వినిపిస్తే, ఆసాంతం గ్రహించాను. ఏమండీ, పాత కేసు గదూ?"

చిక్కి బిక్కిరించవలసిన పరిస్థితే అయినా, దిగజారిపోకుండా బింకాన్ని చిక్కబట్టుకున్నాడు నరహరి. లేని గాంభీర్యాన్ని ఒలకబోస్తూ 'యిహిహీ' అంటూ పళ్ళుయికిలించాడు. తానేమో దక్షిణ నాయకుడు! ఎందరో అమ్మాయిలు తన సేవ కోసం బడిగాపులు పడ్డారు. పడుతున్నారు. ఇకపైన పడగలరు. అందుకోసమే కట్టుకున్న భార్య అసూయ పడడం షరా నిషిద్ధం. ఆమె భూదేవిలా ఓరిమి కలిగి వుండాలి... ఈ భావాలన్నీ ఆ వెకిలి నవ్వులో ధ్వనించాయి.

మళ్లీ కాంచనమాలే కొనసాగించింది-

"ఎందుకంటే వసుంధర అనే అమ్మాయిని గురించి చాలా చాలా విషయాలు విన్నానులెండి! ఎప్పుడైనా జ్ఞప్తికి వస్తే 'వసుంధరా, ఫూ చర్ క్రీ చర్' అనుకుంటూ వుంటాను..."


ఆదమరిస్తే కాంచనమాల తన అంతు కనుక్కోగలదని నరహరికి తెలుసు. అందుచేత వీలయినంత ముక్తసరిగా ఈ ప్రసంగానికి ఫుల్‌స్టాపు పెట్టదలచుకున్నాడు.

"అబ్బే, వట్టి పరిచయమేలే కాంచనా! అంతకు మించి మరేమీలేదు. ఒకప్పుడీ వూళ్లోనే వుండేది. మునిసిపల్ హైస్కూల్లో బియిడి అసిస్టెంటు. ప్రయివేటుగా ఎమ్మేనో పాసయింది. ఎట్లాగో అమెరికా ఛాన్సు తగిలింది. తిరిగొచ్చిందని తెలిశాక ఒకసారి వెళ్లి పలకరించడం మర్యాదగా వుంటుందనుకున్నాను..."

"మర్యాదకేం భాగ్యం! తప్పకుండా వెళ్లిరండి. అయితే ఒక మంచి పని చేసేదానికి జంకుగొంకులెందుకు? ముందుగా ఒక గూఢచారిని ఏర్పాటు చేసుకోవడం, ఏకాంతంలోనే ఆమెను కలుసుకోవాలనుకోవడం యిదంతా ఒక ఎత్తుగడలా తోచడం లేదంటారా?"

ఎలాగైతేనేమి, తిరగబడడానికి నరహరికి కొంత అవకాశం దొరికింది-. "ఎత్తుగడ! దేనికెత్తుగడ? ఏరాజ్యాలు పట్టుకోడానికి ఎత్తుగడ? చెబుతున్నాను కాంచనా! మాటల్ని జాగ్రత్తగా తూచి వాడడం మంచిది."

"కోప్పడకండి!" సముదాయిస్తున్నట్టుగా అంది కాంచనమాల. "మీరు అందంగా బుర్రగా వున్నారుగదా అని ఎందరో అమ్మాయిలు మీవెంట పడి వుండవచ్చు. అందరినీ పెళ్లాడడం సాధ్యమా? అనుకుంటాను. కానీ విచిత్రమేమిటంటే ఇప్పటి వరకు మమ్మల్ని ప్రేమించడానికి గాని, ప్రేమించబడడానికి గానీ ఆస్కారం లేని ఓ అమ్మాయిని మీరు పెళ్లాడేశారు. ఏమండీ, మీకిది ఆశ్చర్యంగా లేదూ




"నీకాశ్చర్యంగా వుందా ఏమిటి?"

"కార్యకారణ సంబంధం తెలిసినప్పుడు ఆశ్చర్యం దేనికి?"

"కారణమా! ఏమిటది?''

నరహరి కళ్లల్లోసూటిగా చూస్తూ అడిగింది కాంచనమాల— "మీకు తెలియదూ?"

ముఖాన మిరియాల ధారు చల్లినట్టయింది నరహరికి. వలలో తగులుకున్న పిట్టలా గింజుకున్నాడు. కాంచనమాల కళ్ళకి రెండు వైపులా పదునుండిపోయింది మరి! 'రథ సంఘంబులతో, రథావళులతో భద్రేభయూథంబుతో' అన్నట్టుగా భారీ జవహరీతో, బంగారు గుడ్లు పెట్టే ఫిక్సెడ్ డిపాజిట్టుతో, టి.వి, ఫ్రిజ్, పట్టెమంచం, స్టీలు బీరువాలాంటి వస్తు సముదాయంతో ఆమె రాణీసా హేబాగారి లాగా కాపురానికి వచ్చింది! కోరినట్టయితే కొండమీది కోతినైనా తెచ్చిపెట్టగల తండ్రి ఆమెకు కొండంత అండగా వున్నాడు. ఇలా బంగారు చెంచా నోట్లో వుంచుకుని పుట్టినందుకు పరిహారంగా, ఆమె తెలివి తక్కువ బద్ధాయి అయినా అయివుండొచ్చుగదా! అలా జరిగుంటే యికలేనిదేముంది? తనపైన కుట్ర పన్నినట్టు భగవంతుడామెకు అమోఘమైన తెలివి తేటల్ని గూడా ప్రసాదించాడు.

"పిల్లలకు చదువు చెప్పుకునే పంతులమ్మగదూ!" స్వగతంలా చెప్పుకుపోసాగింది కాంచనమాల. "నమ్మివుంటుంది. ప్రేమించివుంటుంది. మనసు విప్పి మాట్లాడి వుంటుంది. ఉత్తరాలు రాసివుంటుంది. ఫోటోలకు గూడా దిగి వుంటుంది. అంతకు మించి నిరుపేద పంతులమ్మ ఏమివ్వగలుగుతుంది?"

"కాంచనా!"— ఉరిమినట్టుగా అన్నాడు నరహరి "కట్నాలు, కానుకలు నాకు తృణప్రాయం. నాకు ప్రేమే ముఖ్యం. దాని తరువాతనే మిగిలినవన్నీ! వసుంధర నన్నెంతగా ప్రేమించిందో, అంతకు పదిరెట్లు ఎక్కువగా నేనామెను ప్రేమించాను. కానీ ఏం లాభం? పరిస్థితుల చేతిలో మనిషి ఒక్కొక్కప్పుడు కీలుబొమ్మగాక తప్పదు వసుంధరను పెళ్లాడాలన్న నా ప్రతిపాదనకు బంధువులందరూ అడ్డుతగిలారు. ససేమిరా ఆపని జరగడానికి వీల్లేదని హఠం పట్టారు. నాకూ మతి పోయిందనుకో! ఏంచేయడానికి తోచిందిగాదు. చివరకు నిద్రమాత్రలు మింగేశాను కూడా!"

పెదవిపైకి రాబోయిన నవ్వును మునిపంటితో నొక్కిపట్టుకుంది కాంచనమాల.

అగ్గిపైన గుగ్గిలంలా రేగిపోయాడు నరహరి. "ఏమిటి? నిద్రమాత్రలు మింగడమంటే నీకు నవ్వులాటగా వుందా?" అని గద్దించాడు.

"అబ్బే లేదండీ!" అనునయిస్తున్నట్టుగా అంది కాంచనమాల. "నిద్రమాత్రల పట్ల నాకు చెప్పలేనంత గౌరవం వుంది. ఒకే రాయితో రెండు పిట్టల్ని కొట్టడం గురించి వింటుంటాం. మూడు పిట్టల్ని పడగొట్టడమంటే సామాన్యమా? 'అయ్యో, మన మూలంగా ఒక మానవుడు అఘాయిత్యాలకు పూనుకోనేల' అంటూ, ఆఅమ్మాయి దారినుంచీ వైదొలగడం ఒకటి. 'ఆహా, ఈ మనిషి ఆఅమ్మాయిని ఎంత గాఢంగా ప్రేమించాడో గదా' అన్న లోకుల సానుభూతికి నోచుకోవడం ఒకటి. లైన్ క్లియర్ గావడంతో అన్నిహంగులతోనూ ఒక అయినింటి అమ్మాయిని పెళ్లాడడం ఒకటి. మొత్తం మూడు పిట్టలు కాలేదా?"

"చాల్లే నోర్ముయ్". గొంతుచించుకున్నట్టుగా అరిచాడు నరహరి. "మోతాదు కొంచెం ఎక్కువైనా, తక్షణం ట్రీట్‌మెంట్ జరక్కపోయినా నాకు నేలపైన నూకలు చెల్లిపోయి వుండేవి ఆసంగతి తెలీదేమె నీకు?"

"కానీ మీ తెలివితేటల పైన నాకు అపారమైన నమ్మకముంది..." చెక్కుచెదరకుండా ఈ మాట మాత్రం చెప్పి, కాంచనమాల నెమ్మదిగా గదిలోనుంచీ హాల్లోకి వెళ్లిపోయింది.

బిర్రబిగుసుక పోయిన నరహరి శరీరం చాలాసేపటి వరకు సోఫాలో అచేతనంగా వుండిపోయింది.

* * *

వసుంధరను కలుసుకోవడంలో అనుకోని యిబ్బంది ఒకటి ఎదురైంది. భర్త బయటికి వెళ్లిపోయాక ఆమె గదిలో ఒంటరిగా వుండవలసింది. కానీ సమయానికి తెలిసిన వాళ్లెవరో వూడిపడ్డారు. వచ్చిన వాళ్ళు నింపాదిగా గంటల తరబడీ మాట్లాడుతూ కూచున్నారు. తర్వాత వాళ్లను సాగనంపడంకోసం వసుంధర గూడా బయటకి వెళ్ళిపోయింది.

ఎప్పటికొస్తుందో తెలియని పరిస్థితి. ముళ్లపైన నిల్చున్నట్టుగా నరహరి ఆమెకోసం వేచి వుండిపోయాడు.

తిరిగ్గా అరగంటసేపటికి వసుంధర తిరిగొచ్చింది. వసారాలో మనిషి పొలకువ గమనించి తిరిగి చూసేసరికి, గోళ్ళు గిల్లుకుంటూ స్తంభం చాటున నిలబడివున్న నరహరి కనిపించాడు.

"హలో నరహరిగారూ! నమస్కారం. 'నేనొచ్చానని ఎలాగో తెలుసుకున్నారే! రండి, రండి" అంటూ గది తలుపులకున్న తాళం తీసింది. 'కూచోండి' అంటూ పేము కుర్చీ చూపెట్టింది. 'అరరే, సమయానికి మావారు లేకపోయారే!' అని నొచ్చుకుంటూ కిటికీ తలుపులు తెరిచింది. లైట్లు వేసింది. ఫాన్ ఆన్ చేసింది. అటెండరును పిలిచి, కాఫీలు తెప్పించమని పురమాయించింది.

మనిషి కొంచెం లావెక్కింది. కళ్లలో కొత్తకాంతులు తొణికిసలాడుతున్నాయి. ఆమె శోకదేవతలా లేదు. చైతన్య స్రవంతిలా వుంది. ఓదార్చడానికి వెళ్ళిన నరహరి, ఓదార్పు బడడానికి సిద్ధంగా ముఖం వేలా

**Tel : 62016, 63172**

GROUP TOURS TO

# Singapore Hong Kong - Manila

# Europe and USA

*Contact :*

**Travelexpress**

HOTEL APSARA ARCADE
12-4-41 Waltair Main Road
VISAKHAPATNAM-530 002 (A.P.)

ని చేసుకుని కుర్చీలో కూర్చుని వున్నాడు.

వసుంధర కుశల ప్రశ్నలు వేయసాగింది. మామూలు విషయాలే! కానీ ప్రతి ప్రశ్నలోనూ ఏదో వ్యంగ్యమేదో స్ఫురిస్తూ వచ్చి నరహరి మెలికలు తిరిగి పోతున్నాడు.

బాగున్నారా! (బాగుండకేం! నిక్షేపంగా వుంటాను.) ఏం చేస్తున్నారు? (చేయడానికేముంది? ఉద్యోగం, పిట్టలవేటా!) మీభార్య ఏమేమిటి? (పేకలో ఏముంది భర్త హృదయంలో చోటుండటమే ... భార్యకు చెప్పండి!) ఏం చదువుకుంది? (భార్యకు విద్యా వివేకాలెందుకు ఎంత మూర్ఖురాలైతే అంత మంచిది.)

చాలా అవసరమైనప్పుడు పొడి మాటలు వల్లిస్తూ, మిగిలినప్పుడు గంగిరెద్దులా తలాడిస్తూ కూచున్నాడు నరహరి. శ్రోతను మరింక ఎలా ఎంటర్‌టెయిను చేయాలో తోచక, వసుంధర ఓపత్రికను తిరగేస్తూ అందులో లీనమైపోయింది. తానక్కడికి రావడం పెద్ద పొరబాటైపోయిందని నరహరికిప్పుడర్థమైపోయింది. మెడబట్టి గెంటినట్టుగా బయటపడాలనే వుంది. కానీ కాఫీ కోసం వెళ్ళిన కుర్రకుంక ఎంత సేపటికీ తిరిగి రావటంలేదు.

వాతావరణం ప్రశాంతంగానే వున్నప్పటికీ, మనసులో చెలరేగుతున్న అలజడివల్ల ఓటాక్సీ వచ్చి గెస్టుహవుసు ముందు ఆగిన శబ్దం నరహరికి వినిపించింది గాదు. బూట్ల చప్పుడు దగ్గరయ్యేసరికి అతడి గుండెల్లో రైళ్ళు పరుగెత్తాయి. గ్రీకు నాటకాల్లో హీరో వేషం వేయడానికి అన్ని అర్హతలు కలిగి వున్న ఒక మగరాయుడు ధాటీగా నడుచుకుంటూ గదిలోకి వచ్చేశాడు.

"ఏమండీ, వచ్చేశారా! నేను నరహరి అంటూ ఒకాయన్ను గురించి చెబుతున్నది దాన్ని గదూ! ఈయనే!" వసుంధర పరిచయం కానిచ్చింది.

గొప్ప హాస్యసన్నివేశమేదో ఎదురైనట్టుగా, ఆపెద్ద మనిషి గొల్లున నవ్వేశాడు. "అట్లాగా! నరహరిగారంటే మీరేనా! గ్లాడ్ టు మీట్ యూ!" అంటూ చేయి సాచాడు.

ఆ దంపతుల వైపు బిక్క చూపులు చూస్తూన్నాడు నరహరి. ఉదయం కొండమాల దగ్గర తన పని పెనములో నుంచి వార్చినట్టయింది. ఇప్పుడా పెనములో నుంచీ పొయ్యిలోకే గిరవాటు పెట్టినట్టయింది. ఒళ్లంతా బొబ్బలెగిరి పోతున్నట్టుంది. ఈగాయాలను మాన్పగల అమృత రసాయనం ఎక్కడ దొరుకుతుంది?